కథ

డా. తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం

# శీతవేళ రానీయకు

"ఎలావుంది నాన్నా శ్రీనివాసరావు అంకులికి?" గేటు తీసుకుని లోపలికి వస్తున్న రాజారావును ఆదుర్దాగా ప్రశ్నించింది సూర్యప్రభ.

"రేపటికిగానీ ఏమీ చెప్పలేనన్నాడమ్మా డాక్టరు..ఇంటెన్సివ్‌కేర్ యూనిట్‌లో వుంచారు" దిగులుగా జవాబిచ్చాడు రాజారావు.

"అటాక్ వచ్చిన వెంటనే హాస్పిటల్‌కి తీసుకు వెళ్ళారు కదా నాన్నా. ఫరవాలేదు లెండి. ఇప్పుడు మంచి మందులు వున్నాయి కూడా. ఆరోగ్యంగా తిని తిరుగుతున్న మనిషి కదా..మీరు దిగులుపడకండి. మీ అల్లుడు ఇంటికి రాగానే నేను, ఆయన వెళ్ళి చూసొస్తాం" అంటూ ధైర్యం చెప్పింది సూర్యప్రభ.

శ్రీనివాసరావుగారంటే తండ్రికి ఎంత అభిమానమో ఆమెకు బాగా తెలుసు.

వాళ్ళిద్దరూ చిన్నప్పుడు కలిసి చదువుకున్నారు. ఉద్యోగరీత్యా చెరొకపక్కకు చెదిరిపోయినా స్వంత ఊరినీ, కన్న తల్లినీ చూసేందుకు వచ్చినప్పుడు బాల్యాన్ని నెమరేసుకుంటూ స్నేహాన్ని వాడిపోనీయకుండా కాపాడుకుంటూ వచ్చారు.

వాళ్ళ అదృష్టంకొద్దీ శ్రీనివాసరావుకి ఒక్కగానొక్క కొడుకు లా చదివి తాతగారి ప్రాక్టీసు అందిపుచ్చుకుని అనంతపురంలోనే స్థిరపడ్డాడు. అనుకోకుండానే రాజారావుగారి ఒక్కగానొక్క అమ్మాయికి అనంతపురంలో ప్రైవేటు కాలేజీ నడుపుతున్న భాస్కర్‌తో వివాహం జరగడంతో స్నేహితులిద్దరూ ఉద్యోగవిరమణ తరువాత పిల్లల దగ్గరికి చేరుకున్నారు.

గత రెండేళ్ళుగా స్నేహితులిద్దరూ ప్రతిరోజూ కలిసి సాయంకాలం వ్యాహ్యాళికి వెళ్ళడం, అనుభవాలు కలబోసుకోవడం, అరమరికలు లేకుండా మనసువిప్పి మాట్లాడుకోవడం వలన మరింత దగ్గరయ్యారు.

హఠాత్తుగా శ్రీనివాసరావుకు గుండెపోటు వచ్చి హాస్పిటల్‌లో చేర్పించడంతో రాజారావు కృంగిపోయాడు.

ఆ రాత్రి సూర్యప్రభ ఎంత బ్రతిమలాడినా ఆయన ఏమీ తినలేదు. ఆయన రిటైరవ్వడానికి రెండేళ్ళ ముందు రాజారావు భార్య మరణించింది. నిజానికి యవ్వనంలో వున్నప్పటికన్న వృద్ధాప్యంలోనే భార్యాభర్తలకు ఒకరితోడు ఒకరికి మరీ అవసరం. ఆ దెబ్బనుండి కోలుకోవడానికి ఆయనకు చాలా సమయమే పట్టింది. తల్లిని పోగొట్టుకుని తల్లడిల్లుతున్న కూతుర్ని కంటిపాపలా చూసుకోవడం, ఉద్యోగ బాధ్యతల నిర్వహణలో ఆ దుఃఖాన్నుండి కోలుకున్నాడాయన. అంతలోమళ్ళీ ఈ అశనిపాతం!

ప్రొద్దున్నే లేచి హాస్పిటల్‌కి వెళ్ళాలని అయిదింటికి అలారం పెట్టుకుని పడుకున్నాడు రాజారావు. ఎప్పటికోగానీ నిద్రపట్టలేదు ఆయనకు.

తెల్లవారు ఝామున నాలుగింటికి తండ్రిని నిద్రలేపింది సూర్యప్రభ. "అంకుల్‌కి మళ్ళీ గుండెపోటు వచ్చిందట నాన్నా" అంటూ.

ఆయన వులికిపడి లేచి, చొక్కా తొడుక్కుని హడావుడిగా బయటకు వచ్చేసరికి ఎర్రబడిన కళ్ళతో నిలబడి వున్నాడు శ్రీనివాసరావు కొడుకు రవి.

మాట్లాడకుండా అతని భుజం చుట్టూ చెయ్యి వేసారు రాజారావుగారు.

"నాన్నగారు మూడున్నరకు పోయారు అంకుల్. అమ్మకు మీరే ధైర్యం చెప్పాలి" అన్నాడతను వణుకుతున్న గొంతుతో.

రాజారావుగారికి కాళ్ళు చేతులు చల్లబడినట్టయిపోయి వరండాలో కూర్చుండిపోయారు. సూర్యప్రభ గ్లూకోజు నీళ్ళు తెచ్చి తాగించింది తండ్రితో. భాస్కర్ ఆయన వెంట బయల్దేరాడు.

స్నేహితుడికి ఆఖరి వీడ్కోలు పలికి సంధ్యవేళలో ఇల్లు చేరాడు రాజారావు.

ఎర్రబడిన కళ్ళు, పీక్కుపోయిన ముఖం, రేగిన జుత్తుతో ఒక్కరోజులోనే పదేళ్ళ వయోభారం మీదపడినట్టు కనబడుతున్న తండ్రిని చూసి తల్లడిల్లిపోయింది సూర్యప్రభ.

ఆరోజు ఆయన మెతుకు ముట్టలేదు. రాత్రి అంతా తన గదిలో పచార్లు చేస్తూ గడిపేడు.

"ఏమిటనాన్నా ఇది? మీరే మనసు గట్టి చేసుకోలేకుంటే ఆయన భార్య, కొడుకు మాటేమిటి? మీరే వాళ్ళను ఓదార్చాలి. ధైర్యం చెప్పాలి" అంటూ తండ్రి దృష్టిని మరల్చడానికి ప్రయత్నించింది సూర్యప్రభ.

మౌనంగా కూతురివైపు చూసి వూరుకున్నాడు రాజారావు.

మర్నాటి నుండి రాజారావులో చిత్రమైన మార్పు వచ్చింది. ఇంటి గురించీ, మనవడి గురించీ ధ్యాసలేకుండా వుండిపోవడమేకాక తన గురించి తాను పట్టించుకోవడం మానేసాడు.

"అదేమిటి నాన్నా గడ్డం చేసుకోలేదు. మాసిపోయిన షర్టు తొడుక్కున్నారు" అంటూ సూర్యప్రభ అడిగింది.

"ఇప్పుడు నేనెలా వుంటే ఏమిటమ్మా? అరవై ఏళ్ళు దాటాయి నాకు. ఇవాళో రేపో నా వంతూ వస్తుంది" అన్నాడు విరక్తిగా.

సాయంత్రమయ్యేసరికి నీట్‌గా తయారై వాకింగుకు వెళ్ళే మనిషి ఇంట్లోంచి కదలడం లేదు. మాసిన పంచె, నలిగిన బనీనుతో ఎక్కడో ఒకచోట నిరాసక్తంగా కూర్చుంటున్నాడు.

"కాస్త మంచి బట్టలు వేసుకుని అలా తిరిగిరా నాన్నా" అని సూర్యప్రభ రొక్కించితే..

"ముసలివాడికి షోకులు దేనికమ్మా - అటో కాలు ఇటో కాలు వేసి వున్నవాడిని. ఈ కాసిని రోజులు ఎలాగో గడిచిపోనీ..." అంటూ నిట్టూర్చాడు.

పరిస్థితి ఇలా వుండగా రాజారావు ఈడువాడే అయిన అతని పెద్దమ్మ కొడుకు జాండీసుతో చనిపోయినట్టు తిరుపతి నుండి వార్త వచ్చింది.

ఆ మాట ఆయనకు చెప్పడానికి సూర్యప్రభ భయపడింది. కానీ తప్పలేదు. అన్నగారి దినాలకు తిరుపతికి వెళ్ళి వచ్చాక రాజారావు పూర్తిగా అంతఃర్ముఖుడైపోయాడు.

ఏం తింటున్నాననన్న ధ్యాస లేకుండా ఏదో కాస్త తినడం, భగవద్గీత పట్టుకుని పడక కుర్చీలో వాలడం. కాసేపు చదివి అలిసిపోతే నిద్రపోవడం.

మనిషి నీరసించిపోయి నడవడానికే శక్తిలేనట్టు తయారయ్యాడు.

"నువ్విలా అయిపోతే నా గతేమిటి నాన్నా? నాకోసమైనా నువ్వు మునుపటిలా హుషారుగా వుండాలి" అంటూ సూర్యప్రభ కన్నీళ్ళు పెట్టుకుంది.

"నువ్వు ఆలోచించాల్సింది నీ భర్త గురించి, పిల్లల గురించే గానీ నా గురించి కాదు. నీ పట్ల నా బాధ్యత నెరవేర్చాను. ఇక నీకు నా అవసరం వుందనుకోను" అన్నాడాయన కళ్ళు తెరవకుండానే.

ఆ రాత్రి సూర్యప్రభ తండ్రి గురించి చెప్పుకుని భాస్కర్ దగ్గర ఏడ్చేసింది.


భాస్కర్‌కు రాజారావుగారంటే గౌరవమేగాక అభిమానమూ పుష్కలంగా వుంది. ఆయనను పిల్లనిచ్చిన మామగారిలాకాక తనకు తండ్రి లేని లోటు తీర్చిన వ్యక్తిగా ఆదరించాడతను.

ఈ నడుమ ఆయన తీరు గమనిస్తుంటే అతనికీ బాధగానే వుంది.

"నువ్వు దిగులుపడకు ప్రభా! మావయ్యను మామూలు మనిషిని చేసే బాధ్యత నాది" అంటూ భార్యను ఓదార్చాడు.

* * *

నాలుగు రోజులు గడిచాయి. ఒకరోజు ఉదయాన్నే



ఇంటిముందు ఆటోరిక్షా ఆగింది. ఆ శబ్దం విని వరందాలో పడక్కుర్చీలో కళ్ళు మూసుకుని పడుకుని వున్న రాజారావు కళ్ళు తెరిచి చూసాడు.

ఆటోరిక్షా దిగిన వ్యక్తి ఒక చేతిలో బ్రీఫ్ కేసు, మరొక చేతిలో జిప్‌బాగ్ పట్టుకుని చకచక నడిచి మెట్లెక్కి రాజారావుని సమీపించాడు.

అప్పుడు గుర్తుపట్టాడు రాజారావు.

"అరె! విశ్వమూర్తీ! ఏమిటిలా హఠాత్తుగా ప్రత్యక్షమయ్యావు?" అంటూ సంభ్రమంగా లేచి కూర్చున్నాడు.

విశ్వమూర్తి చిరునవ్వుతో అతని పక్కనవున్న బల్లమీద కూర్చున్నాడు.

విశ్వమూర్తి రాజారావు కల్సి ఆరేళ్ళు కర్నూల్లో పనిచేసారు. రాజారావుకన్నా అతను రెండేళ్ళు పెద్దవాడు.

చురుకుగా, ఆరోగ్యంగా కనబడుతున్న విశ్వమూర్తిని ఆశ్చర్యంగా చూస్తూ "ఇన్నాళ్ళకు మా ఊరికి వచ్చి నన్ను వెతుక్కుని వచ్చావు. ఏమిటి విశేషం?" అనడిగాడు రాజారావు.

వయసుకు మించిన ముదిమిని మోస్తున్నట్టు కనబడుతున్న రాజారావును "ఏమిటోయ్ ఇలా ముసలాడివైపోయావ్. ఆరోగ్యం బాగా లేదా?" అంటూ పరామర్శించలేదు విశ్వమూర్తి.

"మా సేవాసమితి తరపున మీ ఊళ్ళో ఒక కల్చరల్ ప్రోగ్రాం ఏర్పాటు చేస్తున్నాం. మొన్న వరదల్లో ఇళ్ళు పోగొట్టుకున్న వాళ్ళకోసం విరాళాలు సేకరించడానికి మేము ఎన్నుకున్న మార్గమిది. నీకు తెల్సుగా నాకు కాస్త నాటకాల పిచ్చి వుండేది. రిటైరయ్యాక మళ్ళీ పాత అభిరుచులు పైకి వచ్చాయి. ఈ ఊళ్ళో నీకు చాలామంది తెలిసివుంటారు. నువ్వూ నాతోబాటు తిరిగి ఏర్పాట్లకు సాయపడాలి. టికెట్లు అమ్మిపెట్టాలి" ఒక్క గుక్కలో విషయం చెప్పాడు విశ్వమూర్తి.

"దానికేం భాగ్యం? ముందు నువ్వు స్నానం చేసి టిఫిన్ తిను. తర్వాత ఆ ఏర్పాట్లు చూద్దాం. లలిత కళా సమితి ప్రెసిడెంటు నాకు తెల్సిన వాడే. నీకు పరిచయం చేస్తాను" అన్నాడు చిరునవ్వుతో.

"ప్రభా! విశ్వమూర్తిగారని నా స్నేహితుడు. నాటకాల పిచ్చి వుండేదని చెప్పేవుంటాను. కాస్త కాఫీ, టిఫిన్ సంగతి చూడు" అంటూ కూతుర్ని పిలిచాడు.

"కర్నూల్లో మనింటికి వచ్చేవారుగా నాన్నా! గుర్తులేకేం! బాగున్నారా అంకుల్" అంటూ పలకరించి ఆయనకు కాఫీ తెచ్చిచ్చింది సూర్యప్రభ.

విశ్వమూర్తి స్నానం చేసి టిఫిన్‌కి వచ్చేసరికి తనూ తయారై టిఫిన్ తిందానికి వచ్చాడు రాజారావు.

శుభ్రంగా గడ్డం చేసుకుని, సఫారీ డ్రెస్ తొడిగి స్నేహితుడి వెంట చురుకుగా నడుస్తూ వెళ్తున్న తండ్రిని చూస్తుంటే సూర్యప్రభకు సంతోషంగా అనిపించింది.

విశ్వమూర్తి వున్న నాలుగు రోజుల్లో ఒక్కసారి కూడా రాజారావు తన ముసలి వయసు గురించి మాట్లాడకపోవడం గమనించింది సూర్యప్రభ.

బయల్దేరేముందు అప్పుడే గుర్తొచ్చినట్టుగా అన్నాడు విశ్వమూర్తి. "అవునోయ్ రాజారావ్. నీకు హోమియోపతి అంటే ఇష్టం కదూ? బాగా చదివావు- ఏదో సర్టిఫికెట్ కూడా సంపాదించావు. మా ఊరొచ్చి నాలుగు లెక్చర్లివ్వరాదూ మా వాళ్ళకు? మేము నెలకు ఒకసారి పేదవాళ్ళకి మెడికల్ క్యాంపు నడుపుతాము. శ్రమ అనుకోకుండా నువ్వు రాగలిగితే బావుంటుంది" అని.

"తప్పకుండా వస్తాను" అన్నాడు రాజారావు వుత్సాహంగా.

"అలాగే నువ్వొక ఫ్రీ క్లినిక్ ఎందుకు నడపకూడదు ఈ ఊళ్ళో? పేదవాళ్ళకు సాయం చేసినట్టు వుంటుంది. ఇక్కడ వున్న హోమియోపతి డాక్టర్లని కూడా కలుపుకుంటే ఇంకా బాగుంటుంది" మరో సలహాను చాలా కాజువల్‌గా ఇచ్చేసి వెళ్ళిపోయాడు విశ్వమూర్తి.

మరునాటిరోజున అటకమీద పడేసిన హోమియోపతి పుస్తకాలు క్రిందకి దింపి దుమ్ము దులిపి గూట్లో వరుసగా పేర్చాడు రాజారావు.

రెండ్రోజులయ్యాక "భాస్కర్ మీ కాలేజీలో సాయంత్రం పూట ఉచితంగా మందులిచ్చే క్లినిక్ నడిపితే ఎలా వుంటుంది?" అని అల్లుడిని అడిగాడు రాజారావు.

"మీకు పరిచయం వున్న డాక్టరు చలమయ్యగారు కూడా ఇలాటి అభిప్రాయమే వెలిబుచ్చారు మావయ్యా. తప్పకుండా మొదలుపెడదాం" అన్నాడు భాస్కర్.

రాత్రి పదకొండు గంటలప్పుడు చాలా శ్రద్ధగా 'మెటీరియా మెడికా'ను చదువుతున్న తండ్రిని చూసిన ప్రభ అడిగింది "నిజంగా మీరు కర్నూలు వెళ్ళి లెక్చర్లివ్వడం ఇక్కడం క్లినిక్ పెట్టడం చేస్తారా నాన్నా? ఓపిక వుందా?" అని.

"నాకేమంత వయసు మీరిపోయిందమ్మా ఓపిక లేకపోవడానికి? ఒంట్లో శక్తివున్నంతవరకు నలుగురికి ఉపయోగపడే పనిచేయడం మంచిదే కదా! నిజంగానే నాకు ఇష్టమైన వ్యాపకాన్ని మళ్ళీ మొదలు పెడదామనుకుంటున్నాను" అన్నాడు రాజారావు నవ్వుతూ.

ఆ రాత్రి పడుకోబోయే ముందు భాస్కర్‌తో అంది సూర్యప్రభ "మా నాన్నగారి ముఖంలోకి కళ వచ్చింది. ఉత్సాహంగా కనబడుతున్నారు. ఇంత మంచి ఆలోచన మీకు తట్టినందుకు నాకు చాలా సంతోషంగా వుంది. థాంక్స్..." అని.

"శ్రీనివాసరావుగారి మరణంతో మీ నాన్నగారిలో ఒక రకమైన నిరాశ నిస్పృహ ఏర్పడ్డాయి. ఇక తన పని అయిపోయింది. తొందరలోనే తనూ అలాగే పోతానన్న భావం కలిగింది. ఆయనలో ఆ నిర్లిప్తతను పోగొట్టాలనే మావయ్యకు తెలిసిన స్నేహితుల గురించి వాకబు చేసి విశ్వమూర్తిగారిని కలిసాను. చాలామందికి రిటైరయ్యేసరికి జీవితంలో బాధ్యతలు తీరిపోతాయి. అటు ఉద్యోగం నుండి విశ్రాంతి, ఇటు మరొక వ్యాపకం లేకపోవడం జరిగితే తాము ఎందుకూ కొరగామనీ, ఎవరికీ తమతో అవసరం లేదనీ ఆత్మన్యూనతకు లోనవుతారు. అది డిప్రెషన్‌కి దారితీస్తుంది. అందుకే తనకిష్టమైన వ్యాపకం కల్పించమని సలహా ఇచ్చారు విశ్వమూర్తిగారు. అందుకు ఆయనే పూనుకుని రావడంతో మావయ్యగారిలో మార్పు సులభంగా వచ్చింది. వయసు మళ్ళినా మనసుకు శీతవేళ రానీయకుండా చూసుకోవాలని నాకూ అర్థమయింది" అన్నాడు భాస్కర్.

○